సాక్షి నిర్మల్

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



మనసు నిండా... 8లో▸

మాండలికపు పరిమళాలు

ఆదిలాబాద్‌లో ఆకాశవాణి కేంద్రం 1986 అక్టోబర్ 12న ప్రారంభమైంది. 2015 ఆగస్టు 15న నాణ్యతతో కూడిన కార్యక్రమాలు ప్రారంభించింది.



కీరదోస కేరాఫ్ కనకాపూర్

లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ రైతులు మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కీరదోస సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. తామే పంటను విక్రయించుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.2 / 14.2

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం సమయంలో వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలి ప్రభావం స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: ముదిరాజ్‌ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రంలోని బంగల్ పేట్ ముదిరాజ్ సంఘ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, కౌన్సిలర్ బిట్లింగ్ నవీన్, కో ఆప్షన్ సభ్యుడు చిలుక గోవర్ధన్, ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, మహాలక్ష్మీ ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- సీఎం, స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా(ముధోల్): నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివానం సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులను కలిసి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వారిని కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారి దృష్టికి తీసుకెళ్లారు. మినీస్టేడియం, పల్లె దవాఖానాతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. భైంసా పట్టణంలో అర్బన్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పెండింగ్‌లో ఉన్న షాదీ ముబారక్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలోనే లబ్ధిదారులకు చెక్కులు అందిస్తామని పేర్కొన్నారు.

మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగిన మల్లన్న జాతర ముగిసింది. ఈ మేరకు జాతర సందర్భంగా స్వామివారికి కానుకల రూపంలో భక్తులు సమర్పించుకున్న ఆలయ హుండీని ఆదివారం లెక్కించారు. మొత్తం రూ.4.82 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.








పోచమ్మ విగ్రహంతో శోభాయాత్ర

పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయ 17వ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారి మూల విగ్రహానికి విశేష క్షీరాభిషేకం, నిత్యార్చన, మూల మంత్ర హవనం, శిలాస్థాపిత దేవతార్చనలు, సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసం, మహాశక్తిన్యాస షడన్యాయప్రయోగం, అష్టభైరవబలి, మహానైవేద్యం, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు సహకారంతో శిలాధ్వజస్తంభ ప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. ఏజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి, సబ్‌కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు, న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, పుట్ట అనిల్, తోట సుమిత్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.
- ఖానాపూర్

రైలు.. ఇంకా లేటే!



- నిర్మలమ్మ కరుణించలే..! • హరీశన్న పట్టించుకోలే..!
- బడ్జెట్లలో కానరాని 'లైను' • ఇక.. కలగానే మన 'రూటు'
- జిల్లాకు రైలు.. కొన్నితరాలు లేటు

నిర్మల్: కనీసం మాట వరుసకైనా మన జిల్లా ఊసు లేదు. నిర్మల్ మీదుగా రైలేస్తామన్న ముచ్చటే లేదు. గతంలో ఇచ్చిన హామీలన్నీ మూట కట్టేశారు. వాళ్లు వీళ్లు కాదు.. ఇద్దరూ జిల్లాకు చేయిచ్చారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్లలో ఎక్కడ కూడా జిల్లాకు రావాల్సిన రైల్వేలైన్ గురించి మాట్లాడలేదు. నిర్మలమ్మ, హరీశన్నలు మొండిచేయి చూపారని జిల్లావాసులు వాపోతున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ మీదుగా ఆర్మూర్–ఆదిలాబాద్ ప్రతిపాదిత రైల్వేలైన్‌లో ఈసారి ఎంతోకొంత ముందడుగు ఉంటుందని ఆశించిన జిల్లావాసులకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు నిరాశలో ముంచాయి. ఇప్పుడే రాలేదంటే.. ఇక కొన్నితరాల పాటు నిర్మల్‌కు రైలురాదిగ అంటున్నారు.

రెండింట్లో మొండిచేయే..

ఈ నెల ఒకటిన పార్లమెంట్‌లో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై చాలారోజులుగా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. ఈసారి ఎలాగైనా ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ గురించి ఉంటుందని భావించారు. ఆదిలాబాద్ నుంచి బీజేపీ ఎంపీగా సోయం బాపురావు ఉండటం, ఆయన కూడా పలుమార్లు రైల్వేలైన్ గురించి కేంద్రం దృష్టికి తీసుకురావడం ఇందుకు కారణాలు. కానీ నిర్మలమ్మ నిర్మల్‌పై ఏమాత్రం కరుణచూపలేదు. ఇక ఈనెల 6న అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి హరీశ్‌రావు కూడా మొండిచేయే చూపారు.

జాయింట్ వెంచర్‌గా..

ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ వేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. ఎందుకంటే ఈ లైన్ సంయుక్తంగా నిర్మించేందుకు గతంలోనే ఈ రెండు ప్రభుత్వాలు ఒప్పుకున్నాయి. 2017లో ప్రస్తుత మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, అప్పటి ఎంపీ నగేశ్ రైల్వేలైన్ కోసం కేంద్రాన్ని కలిశారు. రాష్ట్రం సగం వాటా భరిస్తే రైల్వే లైన్‌కు సిద్ధమని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రం సగంవాటా భరిస్తుందని సీఎం కేసీఆర్ లేఖ రాసిచ్చారు. ఈ లేఖ ప్రకారం అప్పటి రైల్వేమంత్రి సురేశ్‌ప్రభు 2017 బడ్జెట్‌లో రైల్వేలైన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో సంయుక్తంగా రైల్వేలైన్ ఏర్పడుతుందని ప్రకటించారు. ఆ తర్వాత మళ్లీ ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు.

ఇక కలగానే..

'ఇప్పుడే మన జిల్లాకు రైలు రావడం లేదంటే ఇక మరికొన్ని తరాలు వేచిచూడాల్సిందే..' అని జిల్లావాసులు వాపోతున్నారు. రానున్న ఎన్నికలు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లకు ప్రతిష్టాత్మకం. ఈ రెండు పార్టీల మధ్య పోటాపోటీ వాతావరణం ఉంది. ఇలాంటి సందర్భంలోనూ అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రెండూ జిల్లాను పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పుడే రెండు ప్రభుత్వాలు రెడ్ సిగ్నల్ ఇచ్చాయంటే.. ఇక ముందు పచ్చజెండా ఊపుతాయన్న నమ్మకం లేదని జిల్లావాసులు అంటున్నారు. స్థానిక పాలకుల తీరుపైనా ప్రజల్లో అసంతృప్తి వినిపిస్తోంది. ప్రజావసరాన్ని సాధించే క్రమంలో సరైన ప్రయత్నం చేయడం లేదన్న విమర్శ వారిపై వస్తోంది. ఏదిఏమైనా నిర్మల్‌వాసులు ఎక్కాల్సిన రైలు మరో కొన్నితరాలు లేటు.. అన్నట్లుగా మారింది.

చెరువుల వద్దే నైపుణ్య పరీక్ష



బాసర మండలం ఓని గ్రామ చెరువులో వల విసురుతున్న మత్స్యకారుడు (ఫైల్)

- మత్స్య సొసైటీల పెంపునకు కసరత్తు
- చెరువుల విస్తీర్ణం, నీటిలభ్యత ఆధారంగా కొత్త సంఘాల ఏర్పాటుకు ఆదేశాలు
- జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- 1,861 మంది మత్స్యకారులకు అవకాశం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి పాటుపడుతోంది. మత్స్యకారులకు ప్రోత్సాహకాలు, రుణాలు, ఉచితంగా చేపపిల్లలు అందిస్తోంది. దీంతో మత్స్యకారుల ఆదాయం పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని చెరువుల విస్తీర్ణం ఆధారంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను పెంచాలని రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు ఆదేశించగా నూతన సభ్యత్వాలు ఇచ్చేందుకు జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఏప్రిల్ 5వరకు గడువు

మత్స్యకారుడిగా గుర్తింపు పొందాలన్నా, ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలన్నా మత్స్యకారులకు సభ్యత్వం తప్పనిసరి చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందుకు కొత్త సభ్యత్వ నమోదు, సంఘాల ఏర్పాటు ప్రక్రియను చేపట్టింది. మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించి నాలుగు నెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఏప్రిల్ 5 వరకు గడువు విధించింది. దీంతో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఇటీవల జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. అయితే చెరువుల్లో నీటివనరుల విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కొత్తగా 1,861 మందికి సభ్యత్వం నమోదు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శాశ్వత నీటి వనరులున్న జలాశయాల్లోని ఎకరం విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి, వర్షాధారంతో 6–8 నెలలు పాటు నీరుండే జలాశయాల్లో రెండెకరాల విస్తీర్ణంలో ఒక మత్స్యకారుడికి అవకాశం కల్పించనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 651 చెరువులు, ఐదు జలాశయాలు ఉండగా ఇప్పటికే 214 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. ఇందులో 10,153 మంది సభ్యులున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే సంఘాలతో జిల్లాలో మత్స్య సహకార సంఘాల సంఖ్య పెరగనుంది. గతంలో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం మత్స్యకారులుగా కొత్తగా ఏర్పాటు చేసిన జీవో 4 ప్రకారం తెనుగు, గుండ్ల, బెస్తా, ముదిరాజ్ కులాల నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

ఈత కొట్టాలి.. తెప్పపై తిరగాలి

మత్స్యకారులు సభ్యత్వం నమోదు చేసుకోవాలంటే అధికారులు నిర్వహించే పరీక్షలో నెగ్గాలి. జిల్లాలోని జలాశయాలు, చెరువుల వద్దే మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తారు. శాశ్వత నీటి వనరులున్న జలాశయాల పరిధిలోనైతే ఈత కొట్టడం రావడంతో పాటు తెప్పనుంచి వల విసరడం, కచ్చువల వేసే నైపుణ్యం కలిగి ఉండాలి. వర్షాధార జలాశయాల్లోనైతే ఈత కొట్టడం, విసురు వల వేయడం, పాండ్రి వల లాగడం, వల అల్లడం, ఇతర పరీక్షలుంటాయి. మత్స్యశాఖ అధికారుల సమక్షంలోనే నైపుణ్యాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. పరీక్షల్లో నెగ్గితేనే సభ్యత్వం ఇవ్వనున్నారు. అర్హత సాధించిన వారి వివరాలు జిల్లా కార్యాలయం నుంచి రాష్ట్ర కమిషనర్ ఆఫీస్ వరకు వెళ్తాయి. అక్కడి నుంచి అనుమతి రాగానే సభ్యత్వ పత్రాలు అందజేస్తారు.

నిబంధనల మేరకే...



ప్రభుత్వ నిబంధనల మేరకే సభ్యత్వాలు ఇస్తాం. నూతన సంఘాల ఏర్పాటు, సభ్యత్వాలు, చెరువుల కేటాయింపు మొదలైన అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. చెరువుల విస్తీర్ణం, చెరువులున్న ప్రాంతాలు, వృత్తి నైపుణ్య శిక్షణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం.
– నర్సింహారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఈ సీజన్ నుంచే పోర్టిఫైడ్ బియ్యం

- క్వింటాకు ఒక శాతం ఎఫ్‌ఆర్‌కే
- నూతన విధానంతో అక్రమాలకు చెక్



భైంసాటౌన్(ముధోల్): పేదలకు రేషన్ దుకాణాల ద్వారా రూపాయికి కిలో బియ్యం అందిస్తున్న విషయం తెలిసిందే. ఇకనుంచీ బలవర్ధక ముడి పదార్థాలతో కూడిన బియ్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్నారు. త్వరలోనే రేషన్ దుకాణాల్లో సైతం ఇలాంటి బియ్యం అందించాలనే ఉద్దేశంతో ధాన్యం మరాడించే సమయంలోనే ఎఫ్‌ఆర్‌కే (పోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్)ను కలపాలని ఆదేశాలున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యం రైస్‌మిల్లులకు కేటాయించగా, ఈ సీజన్ నుంచే మరాడించిన బియ్యంలో వీటిని కలుపనున్నారు.

క్వింటాలుకు ఒక శాతం

పోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్ అంటే పూర్తి బలవర్ధక ముడి పదార్థం. నూకలు, ఇతర పదార్థాలతో వీటిని తయారు చేస్తారు. విటమిన్ బి 12, మినరల్స్, ఇతర పోషకాలు కలిగిన ముడిపదార్థాలతో ఈ ఎఫ్‌ఆర్‌కే తయారవుతాయి. వీటికి బియ్యం కలుపడం ద్వారా పూర్తి బలవర్ధక ఆహారం అందుతుంది. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లుల్లో మరాడించిన తరువాత బియ్యంలో ఒక శాతం ఎఫ్‌ఆర్‌కే అంటే క్వింటాలు బియ్యంలో ఒక కిలో ఎఫ్‌ఆర్‌కే కలపాల్సి ఉంటుంది. మిల్లర్లు వీటిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి బియ్యంలో కలుపుతారు.

అక్రమాలకు అడ్డుకట్ట...

ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు మిల్లింగ్ కోసం కేటాయిస్తుంది. మిల్లర్లు ధాన్యం మరాడించి బియ్యాన్ని ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే కొందరు మిల్లర్లు ప్రభుత్వం కేటాయించిన ధాన్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడం లేదు. ప్రస్తుతం ఎఫ్‌ఆర్‌కే నూతన విధానంతో ప్రజలకు బలవర్ధక ఆహారం అందడంతో పాటు మిల్లర్ల అక్రమాలకు చెక్ పడనుంది.

ఈ సీజన్ నుంచే అమలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించాం. ప్రతీ క్వింటాలు బియ్యంలో ఎఫ్‌ఆర్‌కే (పోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్) కలపాలని సూచించాం. ఈ సీజన్ నుంచే అమలు చేయాలని ఆదేశించాం.
– తనూజ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

పంట రక్షణకు పాట్లు

- అడవి జంతువులతో నష్టపోతున్న రైతులు
- కాపాడుకునేందుకు రాత్రి, పగలు చేలవద్దే కాపలా
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు

జిల్లాలో యాసంగి సాగు వివరాలు

పంట	ఎకరాలు
శనగ	68,000
మొక్కజొన్న	95,000
వేరుశనగ	1,000
పెద్దజొన్న	600
ఇతర పంటలు	3,000
మొత్తం	1,67,600



హంగిర్గా శివారులో పంట రక్షణకోసం కట్టిన చీరలు



బోరిగాం శివారులో పంటకు కాపలాగా మంచెకింద కూర్చున్న రైతు

తానూరు(ముధోల్): వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అన్నదాతలకు ఏటా కష్టాలు తప్పడంలేదు. జిల్లాలో రైతులు సాగు చేసిన శనగ, పెద్దజొన్న, మొక్కజొన్న, తదితర పంటలపై అడవి జంతువులు దాడిచేసి నష్టపరుస్తున్నాయి. దీంతో పంటలు రక్షించుకునేందుకు రైతులు పగలు, రాత్రి వేళల్లో కాపలా కాస్తున్నారు. అయినా నష్ట నివారణ మాత్రం తగ్గడంలేదని రైతులు వాపోతున్నారు. అడవి జంతువుల దాడిలో నష్టపోయిన పంటలను అటవీశాఖ అధికారులు పర్యవేక్షించి పరిహారం అందించాల్సి ఉండగా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందించాలని కోరుతున్నారు.

ఏటా నష్టాలే..

జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 1,67,600 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఏటా విత్తనాలు విత్తినప్పట్నుంచీ పంటలు ఇంటికి వచ్చే వరకూ కంటికి రెప్పలా కాపలా కాసినా ఫలితం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి తమ వ్యవసాయ పొలాల్లో శనగ, పెద్దజొన్న, మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పంటలు ఎదుగుదల దశలో ఉన్నాయి. జిల్లాలోని భైంసా, సారంగాపూర్, నర్సాపూర్, మామడ, ఖానాపూర్, తానూరు మండలంలోని మహాలింగి, బెల్‌తరోడా, బెంబర, వడ్గాం, కళ్యాణి, కుప్టి, హిప్నెల్లి, ఎల్వి, కోలూరు, మసల్గా, ఉమ్రి(కే), ఝరి(బి), వడ్ఝరి(బి), కుంటాల మండలంలోని దౌనేల్లితండా, అంబుగామ, అంబకంటి సేవాలాల్‌తండా, ముధోల్ మండలంలోని కిర్గుల్ (బి), రువ్వి, ముధోల్, కుభీర్ మండలంలోని రంజిని, సిర్‌పెల్లి, డోడర్న, శివిని, మార్లాగోండా, బెల్‌గాం, బాసర మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూములు గుట్టను ఆనుకుని పంటచేలు ఉన్నాయి. దీంతో పంటచేలపై అడవిపందులు, మానుబోతులు, జింకలు, నెమళ్లు దాడిచేస్తున్నాయి. అడవి పందులు మొక్కలను వేర్లతో సహా పీకివేస్తున్నాయి. అటవీశాఖ, వ్యవసాయశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందించాలని రైతులు కోరుతున్నారు.

రాత్రి, పగలు జాగరణ

జిల్లాలోని ఆయా మండలాల్లో గుట్టను ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లో సాగుచేసిన పంటలను రక్షించుకోవడానికి రైతులు రాత్రి, పగలు కాపలా కాస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జరిగిన పంటనష్టం వివరాలను అధికారులు నమోదు చేసుకున్నా ఇప్పటికీ పరిహారం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి జంతుల నుంచి పంటను కాపాడుకునేందుకు పంటచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు పరిశీలిస్తాం

అడవి జంతువులతో పంటలు నష్టపోయిన రైతులు అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే వారి పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందించే విధంగా చూస్తాం. సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందించాలన్న రైతుల డిమాండ్‌ను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– నందయ్య, అటవీశాఖ సెక్షన్ అధికారి

నిద్రాహారాలు మాని..



ఈ ఏడాది యాసంగి సీజన్‌లో నాకున్న రెండెకరాల్లో పెద్దజొన్న సాగు చేశా. విత్తనాలు విత్తినప్పటి నుంచీ మానుబోతులు, అడవిపందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటచేలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు నిద్రాహారాలు మాని రాత్రి, పగలు చేనువద్దే కాపలా ఉంటున్నా. అధికారులు సమస్య పరిష్కరించాలి.
– ప్రకాశ్, రైతు, హిప్నెల్లితాండ

అధికారులు పట్టించుకోవడం లేదు



నాకున్న మూడెకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో శనగ పంట సాగు చేశా. పంటపొలాల్లో అడవి పందులు, జింకల బెడద ఎక్కువగా ఉంది. సంబంధిత శాఖ అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు సర్వే నిర్వహించి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చూడాలి.
– మహేశ్, రైతు, ఎల్వి

క్లుప్తంగా

బాలుడిపై పంది దాడి

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌ కాలనీలో బాలుడిపై పంది దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆరేళ్ల బాలుడు మహమ్మద్‌ అజీమ్‌ ఆడుకుంటుండగా అక్కడే ఉన్న పంది ఒక్కసారిగా మీదపడి దాడిచేసింది. ఆపేందుకు వెళ్లిన వ్యక్తులపై సైతం దాడికి పాల్పడింది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనం ఢీకొని దంపతులకు గాయాలు



చికిత్స పొందుతున్న కిషన్‌

భైంసాటౌన్‌: ముధోల్‌ మండలంలోని తరోడ వద్ద బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక వైపు నుంచి వచ్చిన టాటా ట్రాలీ వాహనం ఢీకొనడంతో భర్తకు తీవ్ర గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వారి కథనం ప్రకారం.. సారంగపూర్‌ మండలం చించోలికి చెందిన కిషన్‌, గంగాబాయిలు ఆదివారం బాసరలో శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా, తరోడ వద్ద వెనుక వైపు నుంచి టాటా ట్రాలీ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో కిషన్‌ కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కాగా, భార్య గంగాబాయికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రైవేట్‌ అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించగా, వారు ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రాణం తీసిన అప్పుల బాధ

సారంగపూర్‌: అప్పుల బాధ ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన సారంగపూర్‌ మండలంలోని బోరిగాం గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. బంధువుల వివరాల ప్రకారం... రుద్రాక్ష చంద్రశేఖర్‌ (40) పెద్ద కుమారుడికి మానసిక ఎదుగుదల లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం చేయించాడు. అప్పులు భారంగా మారడంతో పాటు కుమారుడికి ఆరోగ్యం నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బయటకు వెళ్తానని భార్యతో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం పంట పొలాలకు వెళ్లే రైతులకు స్వర్ణ కాలువ పక్కనే చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో అతడి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య కవితతో పాటు ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



క్రేన్‌తో కారును తొలగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్‌: అతివేగంగా డివైడర్‌పైకి కారు దూసుకెళ్లిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక కలెక్టర్‌చౌక్‌ సుందరీకరణ పనుల్లో భాగంగా వృత్తకారంలో డివైడర్‌ను నిర్మించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన శ్రీనివాస్‌ అనే వ్యక్తి అర్ధరాత్రి 2 గంటల సమయంలో అతివేగంగా కారు నడుపుతూ డివైడర్‌పై ఎక్కించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదసమయంలో ఎయిర్‌బెలూన్స్‌ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం క్రేన్‌ సాయంతో కారును అక్కడి నుంచి తొలగించారు.



మాండలికపు పరిమళాలు

ఒకప్పుడు దేశంలో, ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా కొన్ని రోజులకు గాని తెలిసేది కాదు. కానీ శాస్త్రీయ పరిశోధనలు ఎన్నో ఆవిష్కరణల ఆవిర్భావానికి నాంది పలికాయి. ఎన్నో విభిన్న సమాచార సాధనాలను పరిచయం చేశాయి. అర క్షణంలో సమాచారం మనమున్న చోటికి వచ్చి చేరింది. ఈ సమాచార విప్లవంలో రేడియోది ప్రత్యేక స్థానం. సమాచారం, వినోదం, సంగీతం ఇలా ఒకటేమిటి ఎన్నో అంశాలను ఒడిసిపట్టి శ్రోతలకు వీనుల విందు చేసింది. ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు, నిర్ణయాత్మక ఘటనలకు వేదికగా నిలిచింది. రేడియోకు ధీటుగా ఎన్ని ప్రసార సాధనాలు వచ్చినా తన రూపు, తీరు మార్చుకుంటూ... కాలం కరిగిపోతున్నా... తరాలు మారిపోతున్నా... తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో వినిపిస్తూనే ఉంది. వైవిధ్యంతో తన ఉనికిని చాటుకుంటోంది. 'ఆదిలాబాద్‌ ఆకాశవాణి కేంద్రం' వైవిధ్య కార్యక్రమాల మేళవింపుతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటూ 'రేడియో'ను పునరుత్తేజితం చేస్తోంది. ఏళ్లుగా తన ఆదరణను నిలుపుకుంటూ వస్తున్న రేడియోపై 'ప్రపంచ రేడియో దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం. – ఆదిలాబాద్‌

- వన్నె తగ్గని రేడియో ప్రసారాలు
- ఎఫ్‌ఎం సౌకర్యంతో అందరికీ అందుబాటులో
- కొంగొత్త ప్రయోగాలతో ముమ్ముందుకు...
- యాస, సంస్కృతికి పట్టం
- త్వరలోనే ఉమ్మడి జిల్లాలో ఆకాశవాణి సేవలు
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

1986 నుంచి నిర్విరామంగా...

ఆదిలాబాద్‌ జిల్లాకేంద్రంలో ఆకాశవాణి కేంద్రం 1986 అక్టోబర్‌ 12న ప్రారంభమైంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రి వెంకటరామిరెడ్డి ఈ భవనానికి శంకుస్థాపన చేయగా, అప్పటి కేంద్ర రేడియో సమాచారశాఖ డిప్యూటీ మంత్రి ఆరీఫ్‌ మహ్మద్‌ఖాన్‌ ప్రసారాలు ప్రారంభించారు. ఈ కేంద్రం దేశంలోనే మూడోది కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో తొలి కేంద్రం కావడం విశేషం. 2015 ఆగస్టు 15వ తేదీన నాణ్యతతో కూడిన ఎఫ్‌ఎం ప్రసారాలను ఆరంభించింది. 'హలో ఆదిలాబాద్‌.. 100.2 ఎఫ్‌ఎం.. మనసు నిండా' అంటూ ప్రస్తుతం మూడు కిలోవాట్ల సామర్థ్యంతో 100.2 ఫ్రీక్వెన్సీ ద్వారా ప్రసారాలను అందిస్తోంది. ఈ ఫ్రీక్వెన్సీతో జిల్లా కేంద్రం నుంచి సుమారు 30–40 కిలో మీటర్ల పరిధిలో శ్రోతలు ఎఫ్‌ఎం ప్రసారాలను వినవచ్చు. త్వరలోనే ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా 100.2 ఎఫ్‌ఎం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

వినూత్న కార్యక్రమాల వీచిక..

ఆదిలాబాద్‌ ఆకాశవాణిలో వినూత్న కార్యక్రమాలను ప్రసారం చేస్తూ శ్రోతలను అలరిస్తున్నారు. తెలంగాణ మాండలికంలో స్థానికత ఉట్టిపడేలా ఈ కార్యక్రమాల పరంపర సాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 11 గంటల వరకు 17 గంటల పాటు 100.2 ఎఫ్‌ఎం..అలా సాగుతూనే ఉంటుంది.

ఆధ్యాత్మికతకు పెద్దపీట...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో పండుగలు, జాతరలు వైభవంగా నిర్వహిస్తారు. అందులోనూ గిరిజన సంస్కృతి, సంప్రదాయ సంబంధమైన జాతర్లలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నాగోబా మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. జాతర మహోత్సవం శ్రోతల కళ్లముందే కదలాడేలా సజీవంగా గోచరించేలా అద్భుతమైన వ్యాఖ్యానంతో ఈ అంశాలను తీర్చిదిద్దుతారు.

సాగుబడికి సాయంగా....



ఆకాశవాణి కేంద్రం ద్వారా వ్యవసాయదారులకు అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు ప్రసారం చేస్తూ వారికి ఎల్లవేళలా కిసాన్‌ వాణి, ఇల్లు ఎవుసం కార్యక్రమాలలో భాగంగా విత్తనాలు విత్తుకోవడం నుంచి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, పంట కోత, పంట నిల్వ, మార్కెటింగ్‌ వంటి వివరాలను సైతం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం నిపుణులు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో విలువైన, సలహాలు సూచనలు నిత్యం అందజేస్తున్నారు. – రైతు అంతరంగం

స్థానిక కళలకు పునరుజ్జీవం



స్థానిక భాష, యాసకు పెద్ద పీటవేసి ఆకాశవాణి హండ్రెడ్‌ పాయింట్‌ టు ఎఫ్‌ఎంలో అంతర్ధానమయ్యే దశలో ఉన్న గ్రామీణ, గిరిజన కలలు కళాకారులను ప్రోత్సహిస్తూ వారిచే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వాటికి జీవం పోస్తుంది. పల్లె పదాలు, గిరిపదం కార్యక్రమాలలో భాగంగా రేల పాటలు, చేల పాటలు, దంచుడు, ఇసిరే, పెళ్లి, ప్రేమ, భజన, గిరిజన దేవతల , గోండి, కొలామి, లంబాడీ పాటలను కళాకారులతో పాడిస్తున్నారు. –మన పురాణాలు

యువజనులకు యువ వాణి..



పాతకాలం వారి కార్యక్రమాలే రేడియోలో ప్రసారం అవుతాయనే సంప్రదాయానికి గండి కొడుతూ యువతను ఆకర్షించే విధంగా యువ వాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వివిధ కళలు, చదువులు, ఉపాధిలో రాణిస్తున్న వారి ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు తీసుకుంటున్నారు. అలాగే 'నాకు నచ్చిన సినిమా పాటలు' అనే కార్యక్రమంలో నూతనంగా రిలీజ్‌ అయిన సినిమా పాటలను ప్రసారం చేస్తూ యువతను ఆకట్టుకుంటోంది. – యువ వాణి

దిగుబడులను పెంచుకోవచ్చు



రేడియోలో వ్యవసాయానికి సంబంధించిన ప్రోగ్రాములు చాలా ఎక్కువగా వేస్తుంటారు. ముఖ్యంగా సాగు చేసే సమయంలో చీడపీడల నివారణపై ఏ మందులు, ఎరువులు వాడాలో అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తుంటారు. అదేవిధంగా నూతన సాగు పద్ధతుల గురించి తెలియజేయడం వలన కొత్త పంటలను సైతం పండించడానికి వీలు కలుగుతుంది.

– చిల్కూరి స్వామి రెడ్డి, తాంసి, రైతు

స్థానిక సంస్కృతిపై అవగాహన



100.2 ఎఫ్‌ఎం తరచూ వింటూ ఉంటాను. సినిమా పాటలతో పాటు ఎంతో విభిన్నమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తుంటారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలతో పాటు కళలు, జాతరల గురించి నేటి తరానికి తెలియజేస్తుండడం అభినందనీయం. నిత్యం సెల్‌ ఫోన్లలో ఉండే యువతకు 100.2 ఎఫ్‌ఎం ద్వారా స్థానిక సంస్కృతి సంప్రదాయాలపైన అవగాహన పెరుగుతుంది.

– జాదవ్‌ అర్జున్‌ కుమార్‌, భుక్తాపూర్‌ ఆదిలాబాద్‌

నాణ్యమైన ప్రసారాలు అందిస్తాం...



ప్రస్తుతం స్థానికతకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఇక్కడి వైశిష్ట్యమైన గిరిజన, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని కాపాడేలా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన ఎఫ్‌ఎం ప్రసారాలు వినిపించేలా టవర్‌ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. టవర్‌ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసారాలు అందుబాటులోకి వస్తాయి.

– రామేశ్వర్‌ కేంద్రే, ఆదిలాబాద్‌ ఆకాశవాణి ముఖ్య కార్యక్రమ నిర్వహణ అధికారి

మద్యం బాటిల్‌లో స్పిరిట్‌



నిర్వాహకులతో వినియోగదారుడి వాగ్వాదం

ఆదిలాబాద్‌: పట్టణంలోని వైన్స్‌ షాపులో స్పిరిట్‌ కలిపిన మద్యం బాటిల్‌ విక్రయించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్‌ బస్టాండ్‌ వెళ్లేదారిలో వైన్స్‌ షాపులో వినియోగదారుడు మద్యం బాటిల్‌ కొనుగోలు చేశాడు. బాటిల్‌ ఓపెన్‌ చేస్తే అందులో స్పిరిట్‌ కలిపినట్లు గుర్తించిన సదరు వ్యక్తి, షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం వారు వేరే బాటిల్‌ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే జిల్లాలోని పలు వైన్స్‌ షాపుల్లో మద్యంలో స్పిరిట్‌ కలిపి అమ్ముతున్నారనే అభిప్రాయాలు వినియోగదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

గుడి గంటలు చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, ధర్మోర, పంచగుడి గ్రామాల్లో గ్రామదేవతల గుడి గంటలు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. పోలీస్‌స్టేషన్‌లో గ్రామాల వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. చోరీకి పాల్పడ్డ వారిని త్వరగా పట్టుకుంటామన్నారు.

బైక్‌ను ఢీకొన్న పొక్లెయిన్‌

తాంసి: భీంపూర్‌ మండలం బుర్కపల్లి శివారులో బైక్‌ను పొక్లెయిన్‌ వాహనం వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌ నడుపుతున్న వ్యక్తి తప్పించుకోగా, బైక్‌ పూర్తిగా దెబ్బతింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బెల్సరీ రాంపూర్‌కు చెందిన గంగారాం బైక్‌పై బుర్కపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుర్కపల్లి రోడ్డుపై మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్‌ వాహనం వెనక వైపు వస్తూ బైక్‌ను ఢీకొని పైకి ఎక్కడంతో పూర్తిగా దెబ్బతింది. పిప్పల్‌కోటి రిజర్వాయర్‌ పనులు కోసం మట్టిని తరలిస్తున్న లారీలతోపాటు పొక్లెయిన్‌ వాహనాలను ఇష్టానుసారంగా నడపడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా



రోడ్డు పక్కన బోల్తా పడిన లారీ

తాంసి: మండలం పొన్నారి సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌ నుంచి మహారాష్ట్ర వైపు సిమెంట్‌ లోడుతో వెళ్తున్న ట్రక్‌ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

అడెల్లిలో భక్తుల సందడి



ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు



ఆలయానికి తరలివస్తున్న భక్తులు

సారంగపూర్‌: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నిజామాబాద్‌, కరీంనగర్‌, వరంగల్‌ తదితర ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరడిగొండ: మండలంలోని వడూర్‌ జెడ్పీసెకండరీ పాఠశాలలో 2002–03 బ్యాచ్‌ పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయంగా సాగింది. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత తిరిగి ఒకచోట చేరారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని పరస్పరం ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకం సాధించిన దత్తు

ఆదిలాబాద్‌: జిల్లా తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌ విద్యార్థి సపావత్‌ దత్తు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. బిహార్‌ రాజధాని పాట్నాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన 18వ జాతీయ అంతర్‌ జిల్లాల జూనియర్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో సత్తా చాటాడు. హెక్సాథ్లాన్‌ పోటీల్లో 4,320 పాయింట్లతో నిలిచి కాంస్య పతకం సాధించాడు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, అథ్లెటిక్స్‌ కోచ్‌ రవీందర్‌ తదితరులు విద్యార్థిని అభినందించారు.

- ఉట్నూర్‌ కేంద్రంగా డయాగ్నోస్టిక్‌ హబ్‌
- 57 రకాల రక్త పరీక్షలు
- సబ్‌ డివిజన్‌ పీహెచ్‌సీల అనుసంధానం

గిరిజనులకు వైద్యసేవలు



నిర్మాణదశలో ఉట్నూర్‌ దయాగ్నోస్టిక్‌ హబ్‌ భవనం

ఉట్నూర్‌: గిరిజనుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టింది. అనారోగ్య లక్షణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తెలంగాణ డయాగ్నోస్టిక్‌ హబ్‌ను ఉట్నూర్‌ కేంద్రంగా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకోగా, త్వరలో డయాగ్నోస్టిక్‌ సేవలు గిరిజనులకు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా..

ఏజెన్సీ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రూ.97 లక్షల నిధులతో ఉట్నూర్‌ సీహెచ్‌సీ ఆవరణలో డయాగ్నోస్టిక్‌ కేంద్ర భవనాన్ని నిర్మిస్తోంది. ఈ భవన నిర్మాణం పూర్తి కాగానే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్ర భవన నిర్మాణం పూర్తికాగానే కేంద్రంలో వైద్యాధికారితోపాటు ఐదుగురు ల్యాబ్‌ టెక్నీషియన్లు, మైక్రో బయాలజిస్టుతోపాటు ఇతర సిబ్బందిని ఐటీడీఏ నియమించనుంది.

57 రకాల రక్తపరీక్షలు..

8 పీహెచ్‌సీల అనుసంధానం

టీ హబ్‌ ఏర్పాటు కాగానే ఏజెన్సీ ఉప డివిజన్‌లోని శ్యాంపూర్‌, హస్నాపూర్‌, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, నార్నూర్‌, గాదిగూడ, ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డయాగ్నోస్టిక్‌ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోకి వచ్చే గిరిజనులకు 57 రకాల రక్తపరీక్షలు నిర్వహించి 24 గంటల్లో ఫలితాలు వెల్లడించనున్నారు. అనుసంధానమయ్యే పీహెచ్‌సీల నుంచి గిరిజనుల రక్తనమునాలు సేకరించి డయాగ్నోస్టిక్‌ కేంద్రానికి పంపించి 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అనారోగ్య లక్షణాలు నిర్ధారించి తగిన వైద్యసేవలు అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ప్రతిరోజు సేకరించిన రక్త నమునాలను తరలించనున్నారు. అనంతరం ఆన్‌లైన్‌ ద్వారా ఫలితాలను ఆయా పీహెచ్‌సీలకు పంపించనున్నారు. ఈ డయాగ్నోస్టిక్‌ కేంద్రం ద్వారా సత్ఫలితాలు వస్తే మిగతా ఏజెన్సీ పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తామని వైద్యాధికారులు అంటున్నారు.

త్వరలో అందుబాటులోకి..

తెలంగాణ డయాగ్నోస్టిక్‌ హబ్‌ ఏర్పాటు ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకుంది. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్రంలో గిరిజనులకు 57 రకాల రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి లక్షణాలను పూర్తిస్థాయిలో గుర్తించి వైద్యసేవలందించే అవకాశం ఉంది.

– బాలు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి, ఉట్నూర్‌

'పట్నాపూర్‌ అభివృద్ధికి కృషి'

బోథ్‌: మండలంలోని పట్నాపూర్‌లో ఎంపీ సోయం బాపూరావు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వాలీబాల్‌ పోటీలను తిలకించారు. ఎంపీ మాట్లాడుతూ పట్నాపూర్‌ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. యూత్‌ కమ్యూనిటీ హాల్‌కు రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీని గ్రామస్తులు సన్మానించారు.

కాల్వలో పడి రైతు మృతి

మామడ: ప్రమాదవశాత్తు సరస్వతీ కాలువలో పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని చందారం గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై అశోక్‌ కథనం ప్రకారం.. కొరికల్‌ గ్రామానికి చెందిన మోతె నడిపి రాజన్న (65) ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం చేను వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా చేను పక్కనే గల సరస్వతీ కాల్వలో పడిపోయాడు. చందారం శివారులోని కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని రాజన్న మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బతుకుదెరువు కోసం రాజస్థాన్‌ రాష్ట్రం నుంచి కొందరు తానూరు మండలం హిప్పెల్లి గ్రామానికి అదివలసవచ్చారు. వేసవికాలం సమీపిస్తుండడంతో మేకలు, గొర్రెలు, ఒంటెలను వెంటబెట్టుకుని కుటుంబంతో కలిసి ఇక్కడకు వచ్చారు. వేసవికి ముందుగానే ఇక్కడకు చేరుకుని పొలాల్లో జీవాల మందపెడుతుంటారు. ఇందుకుగాను రైతులు ఒక రోజుకు రెండు అద్దల బియ్యం రూ.200లు ఇస్తున్నారు. జీవాలకు మేతతోపాటు తమకు ఉపాధి దొరుకుతుందని కాపర్లు తెలిపారు. – తానూరు